క్లుప్తంగా

చెరువు తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



అనధికారికంగా తవ్వుతున్న చెరువు వద్ద నిరసన తెలుపుతున్న మొల్లిపాలెం గ్రామస్తులు

అల్లవరం: ఎంట్రుకోన పంచాయతీ పరిధిలోని మొల్లిపాలెం గ్రామంలో అనధికారికంగా తవ్వుతున్న రొయ్యల చెరువులను గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. జనావాసాలకు ఆనుకుని చెరువుల తవ్వకాలతో రోగాల బారినపడుతున్నామని, అనధికారికంగా రొయ్యల సాగు చేస్తే సహించేందని హెచ్చరించారు. అనధికార రొయ్యల సాగుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఈతకోట రాజు, చుట్టుగుళ్ల నరసింహమూర్తి, ఈతకోట నరసింహమూర్తి, కొల్లు రాంబాబు, చుట్టుగుళ్ల రాజేష్ తదితరులు చెప్పారు. దీనిపై మత్స్యశాఖాధికారి హేమానంద్‌ని వివరణ కోరగా కొత్తగా రొయ్యల చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని, అనమతులు లేకుండా తవ్వకాలు జరిపితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధితులకు న్యాయం చేయండి

కాట్రేనికోన: ప్రజల నుంచి భారీ మొత్తంలో డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన రామలక్ష్మి జ్యుయలరీ వ్యాపారులు అత్తిలి శ్రీకాంత్, శ్రీధర్, అతని తల్లి లోపాయికార ఒప్పందంతో ఆస్తులను విక్రయించిన రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో సుమారు 300 మంది నుంచి సుమారు రూ.5 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన విషయం పాఠకులకు విదితమే. ఇటీవల రామలక్ష్మి జ్యూయలరీ యజమానులు 18 సెంట్ల భూమిని రూ.80 లక్షలకు, ఇంటిని రూ.95 లక్షలకు, షాపును రూ.35 లక్షలకు అమ్మేశారని, ఆ రిజిస్ట్రేషన్‌లను ప్రభుత్వం రద్దు చేసి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. వందలాది మంది నిరుపేదలు తమ అవసరాల నిమిత్తం బంగారం కుదువ పెట్టి వడ్డీకి అప్పు తీసుకుని నగలు ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రామలక్ష్మి జ్యూయలర్స్ వ్యాపారిలో ఒకరైన అత్తిలి శ్రీధర్ అన్నదమ్ములతో అంతర్గత ఒప్పందంతో కాట్రేనికోన ఆటో స్టాండ్ వద్ద కొత్తగా జ్యూయలరీ షాపు తెరిచాడని బాధితులు ఆరోపిస్తున్నారు.

ఫాదర్స్ డే వేడుకలు



ఫాదర్స్‌డే వేడుకల్లో తండ్రిని సత్కరిస్తున్న కుమార్తెలు, కుమారుడు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి సతీమణి చంద్రకళ అధ్వర్యంలో ఫాదర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె తన చెల్లెళ్లు బి.లీలాకుమారి, చింతా రేణుక శ్యామల, తమ్ముడు కడి తాతారావులతో కలిసి తమ తండ్రి కడి వీర్రాజుకు పాదపూజ చేసి సత్కరించారు. అనంతరం ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన మట్టి టిప్పర్

కాట్రేనికోన: పల్లంకుర్రు సాపేవారిపేట రోడ్డులో మోటారు సైకిల్‌ను మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చెయ్యేరు అగ్రహారానికి చెందిన గిడ్డి బయ్యమ్మ తన భర్త సత్యనారాయణతో కలిసి పల్లంకుర్రు శివారు నక్కావారిపేటలోని పుట్టింటికి వచ్చి తిరిగి వెళుతుండగా టిప్పర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైంది. 108 అంబులెన్స్‌లో ఆమెను అమలాపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. టిప్పర్ మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంతో స్థానికులు రోడ్డుపై బైఠాయించి మట్టి పనులను అడ్డుకున్నారు. కాట్రేనికోన ఎస్‌ఐ టి.శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.

రైతులకు నష్ట పరిహారమివ్వాలి

తాళ్లరేవు: దాళ్వా సీజన్‌లో అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారమివ్వాలని టీడీపీ నాయకులు గుత్తుల సాయి, ధూళిపూడి వెంకటరమణ, కొత్తూరు కాశీ తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక లయన్స్‌క్లబ్ హాలులో పంట మునిగింది–పరిహారం ఇవ్వండి కార్యక్రమాన్ని వారు నిర్వహించారు.

పవన్‌కు వినతి పత్రం ఇవ్వాలి

ముమ్మిడివరం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు వినతి పత్రం ఇవ్వాలని ముమ్మిడివరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కోనసీమ రైతు పరిరక్షణ సమితి నాయకులు తీర్మానించారు. ఈ నెల 20న ముమ్మిడివరంలో బస చేయనున్న పవన్ కల్యాణ్‌ను కలిసి కొబ్బరి, వరి, ఆక్వా రైతుల సమస్యలను వివరించాలని రైతు నాయకులు యాళ్ల బ్రహ్మానందం, గుద్దటి జమి, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు తదితరులన్నారు.

దాతలూ సుఖీభవ



అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద కొనసాగుతున్న చలివేంద్రం



అమలాపురం ఫ్రీ టైమ్ సర్వీస్ ప్రతినిధులు నిర్వహిస్తున్న అన్నదానం

- అన్నార్తుల ఆకలి తీర్చుతున్న సేవా సంస్థలు
- మండు వేసవిలో దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు

అమలాపురం టౌన్: గతంలో పోల్చితే ప్రజల్లో సేవా భావం పెరుగుతోంది. సేవ అంటే కడుపేదలకు బంగారు ముద్దలు పెట్టనసరం లేదు. వారి ఆకలి తీర్చేందుకు పట్టెడన్నం పెడితే చాలు. పలు సేవా సంస్థలు అన్నదానాలు నిర్వహిస్తూ అన్నార్తుల ఆకలి తీర్చుతున్నాయి. వేసవిలో ఎండల తీవ్రత నేపథ్యంలో ఎంతోమంది దాతలు ముందుకొచ్చి తాగునీటితో పాటు మజ్జిగ, శీతల పానీయాలు కూడా చలివేంద్రాల ద్వారా అందించి దాహార్తి తీర్చుతున్నారు. పుట్టినరోజు, పెళ్లి రోజులొస్తే విందు, వినోదాలకే ప్రాధాన్యమిచ్చే యువత సేవా బాట పట్టి అనాథ, వృద్ధ, అంధ, మానసిక దివ్యాంగుల కేంద్రాలకు వెళ్లి అన్నదానాలు చేస్తున్నారు.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ప్రధానంగా పది సేవా సంస్థల వరకూ అన్నదానాలు చేస్తున్నాయి. వేసవిలో దాదాపు 45 చోట్ల చలి వేంద్రాలు ఏర్పాటుచేసి పాదచారులు, వాహన చోదకుల దాహార్తిని తీర్చుతున్నాయి. జిల్లా కేంద్రం అమలాపురంలో ఫ్రీ టైమ్ సర్వీస్, ఫ్రెండ్స్ ఫర్ ఫీడింగ్ ఫౌండేషన్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వేద మాత దివ్యభవ్య మందిరం ట్రస్ట్, కోనసీమ ఆహార నిధి, వివేకానంద యోగాశ్రమం ఇలా పలు సంస్థలు అన్నదానాలు చేస్తున్నాయి.

చలివేంద్రాల ఏర్పాటుకు అనూహ్య స్పందన

ఈసారి వేసవిలో జూన్ నెల మూడో వారం ముగుస్తున్నా ఎండల తీవ్రత అధికంగానే ఉంది. జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లా చలి వేంద్రాలు ఎక్కువగా ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలన్న పిలుపునివ్వడంతో అనేక సంస్థలు స్పందించాయి. జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలోనే దాదాపు 20 చోట్ల చలి వేంద్రాలు వెలిశాయి. చాంబర్ ఆఫ్ కామర్స్, వాకర్స్ క్లబ్, అక్షయ పాత్ర, పోలీసు శాఖతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు చలి వేంద్రాలు ఏర్పాటుచేశాయి. అల్లవరం మండలం ఓడలరేవులో సేవా దళ్ చలివేంద్రాన్ని నిర్వహిస్తోంది. గత వేసవిలో నెల రోజులకు మించి ఈ చలివేంద్రం పనిచేసేది కాదు. ఈ వేసవిలో 50 రోజులకు పైగా కొనసాగుతుండడంతో పాటు మజ్జిగ, శీతల పానీయాలు వంటివి కూడా అందిస్తున్నారు. అమలాపురంలో అక్షయపాత్ర సంస్థ ఆధ్వర్యంలో షర్మత్, రాగి జావ కూడా చలివేంద్రంలో అందించడం ఈ వేసవి ప్రత్యేకతగా నిలిచింది.

ఐదేళ్ల నుంచి అన్నదానం చేస్తున్నాం



ఐదేళ్లుగా ఫ్రీ టైమ్ సర్వీస్ ఫౌండేషన్ ద్వారా దాదాపు 50 వేల మందికి అన్నదానం చేశాం. పేదల వద్దకు మేమే వెళ్లి ఆహార పొట్లాలు ఇస్తున్నాం. అన్నదానంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేద కుటుంబాలకు మందులు, నిత్యావసర వస్తువులు సైతం అందిస్తున్నాం.

– తులా రాంబాబు, ఫ్రీ టైమ్ సర్వీస్ వ్యవస్థాపకుడు, అమలాపురం

63 రోజులుగా చలివేంద్రం



అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద 216 జాతీయ రహదారిని ఆనుకుని చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశాం. గత 63 రోజులుగా చల్లటి మజ్జిగతో పాదచారుల, వాహన చోదకుల దాహార్తిని తీర్చుతున్నాం. వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులకు సేవ చేయడం సంతృప్తినిస్తుంది.

– దూడల వెంకట వీరీశాదేవి, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్, వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అమలాపురం

స్పెషలిస్ట్ వైద్యులు కావలెను

- యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో నియామకాలు
- ఈ నెల 26 నుంచి వచ్చే నెల 3 వరకూ ఇంటర్వ్యూలు



యానాం ప్రభుత్వ ఆసుపత్రి

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి రీజినల్ హెల్త్ సొసైటీ పచ్చ జెండా ఊపింది. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో వంద పడకలున్నాయి. యానాం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అగ్రహారం, దరియాలతిప్ప, పరంపేట, కనకాలపేట, కురసంపేట, మెట్టకుర్రు తదితర గ్రామాలకు ఎంతో ఎంతో కీలకమైన ఆసుపత్రిగా పేరొందిన ప్రభుత్వ ఆసుపత్రిలో చాలా ఏళ్లుగా స్పెషలిస్ట్ వైద్యుల కొరత వెంటాడుతుంది. దీంతో ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినా అత్యవసర వైద్యం అందించాల్సిన పరిస్థితుల్లో సైతం కేసులన్నీ కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేసేస్తున్నారు. ఈ కారణంగా ఎంతోమంది క్షతగాత్రులు వైద్యం ఆలస్యమై మార్గమధ్యంలోనే ప్రాణాలు వదిలేస్తున్నారు. అందుకే స్థానికంగా స్పెషలిస్ట్ వైద్యుల్ని నియమించాలంటూ యానాంవాసులు ఏళ్ల తరబడి ఉన్నతాధికారుల్ని, నేతల్ని వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడుగురు స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి యానాం రీజినల్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు మిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరాములు ప్రకటించారు.

ఎంపికైనవారికి రూ.లక్ష జీతం

పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, సర్జన్, మత్తు వైద్యుల పోస్టులకు ఈ నెల 26 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ స్థానిక రీజినల్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసులో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.లక్ష చొప్పున జీతం ఇవ్వనున్నట్లుగా ప్రకటించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని కోరారు. మరోవైపు పుదుచ్చేరి వ్యాప్తంగా సైతం కాంట్రాక్టు పద్ధతిలో 12 మంది ప్రత్యేక వైద్యుల నియామకానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం పుదుచ్చేరి స్టేట్ హెల్త్ సొసైటీ ప్రకటించింది. గైనిక్, ఎనస్తీసియా, ఆప్తమాలజీ, రేడియోలజీ, జనరల్ మెడిసిన్, స్పెషల్ చెస్ట్, సైకియాట్రిస్టు, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ పోస్టులకు పుదుచ్చేరిలోని విక్టర్ సామోనియల్ స్ట్రీట్‌లో హెల్త్ డైరెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఈ నెల 26వ తేదీ నుంచి జూన్ 7 వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

రావులపాలెం: సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన చదరంగం, చిత్రలేఖనం, భక్తి పాటలు, అష్టకములు, శ్లోకాలు, పద్య సూక్తులు, భగవద్గీత, స్టోరీ టెల్లింగ్, వ్యాసరచన పోటీలలో పాల్గొన్న 89 మంది విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కోనసీమ జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ అధికారి సత్తి వీవీ సత్యనారాయణరెడ్డి పాల్గొని చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. కోలాటంలో శిక్షణ ఇచ్చిన కొత్తపేటకు చెందిన రిటైర్డ్ డ్రిల్ మాస్టర్ మారిశెట్టి సత్యనారాయణ, చేతి రాత, డ్రాయింగ్ శిక్షణ ఇచ్చిన లొల్లకు చెందిన చిప్పాడ సత్యనారాయణ, చదరంగం శిక్షణ ఇచ్చిన రాజమహేంద్రవరానికి చెందిన సుబ్రహ్మణ్యశర్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొవ్వూరి వివేకానంద రెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, కొవ్వూరి బ్రహ్మారెడ్డి, సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, చెక్క సూర్యప్రకాష్, వెలగల హరినారాయణరెడ్డి, మన్యం పర్వత వర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

యువతి వైద్యానికి సాయం



సాయి దీపిక కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: ఊపిరితిత్తులకు సంబంధించి వ్యాధితో బాధపడుతున్న అమ్మాయికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆదివారం సాయం అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన పుట్టా సాయిదీపిక భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతుంది. ఆమెకు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి రావడంతో రెండు ఊపిరితిత్తులు మార్చాలని హైదరాబాద్ యశోదా హాస్పిటల్ డాక్టర్లు తెలిపారు. ఈ సర్జరీకి సుమారు రూ.30 లక్షల వరకూ ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. పేదరికంతో ఇబ్బంది పడుతున్న కుటుంబ సభ్యులు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవాసమితి సభ్యులను ఆర్థికసాయం కోరారు. వారికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆపరేషన్ నిమిత్తం ఈ సాయం అందజేసినట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు.

జలకాలాటలలో.. ఏమి హాయిలే హలా..



పి.మల్లవరం మందార కాలువలో వందలాది బాతులు



పోలేకుర్రు డివైడింగ్ డ్యాం వద్ద కాలువలో ఎండ తాపాన్ని తీర్చుకుంటున్న అడవి గేదెలు



ఉప్పలగుప్తం మండలం గోపవరంలో నీటిలో, చెట్ల నీడలో సేద తీరుతున్న గోమాతలు

తాళ్లరేవు/ఉప్పలగుప్తం: రోహిణి కార్తె ముగిసి పదిరోజులు దాటింది. మృగశిర కార్తెలోనూ ఎండలు మండిపోతున్నాయి. సూరీడు ప్రతాపానికి ప్రజలు బయట అడుగు పెట్టాలంటానే భయపడిపోతున్నారు. భానుడి ఉగ్రరూపానికి మనుషులే కాదు మూగజీవాలు సైతం అల్లాడిపోతున్నాయి. అందుకే ఎండ తాపాన్ని తీర్చుకునేందుకు మరో మార్గం కనిపించక కాలువల్లో సేదతీరుతున్నాయి. ఏటా వేసవిలో అడవి గేదెలు ఆహారం, తాగునీటి కోసం గ్రామాల్లోకి వస్తాయి. ఇటీవలే కాలువలకు నీరు విడుదల చేయడంతో తాళ్లరేవు మండలం పోలేకుర్రు డివైడింగ్ డ్యాం వద్ద కాలువ నీటిలో అడవి గేదెలు, మండల పరిధిలోని మందార కాలువలో వందలాది బాతులు సేదతీరుతూ కనిపించాయి. ఉప్పలగుప్తం మండలంలోని గోపవరం గ్రామంలో ఆవులు నీటిలో, చెట్ల నీడలో ఎండతాపాన్ని తీర్చుకున్నాయి. ఆ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

కూరకష్టాలు



బడుగువానిలంకలో ఎండ తీవ్రతకు దెబ్బతిన్న టమాట పంట

- వేసవి తీవ్రతతో తగ్గిన దిగుబడి
- వారం రోజుల వ్యవధిలో రెట్టింపైన ధరలు


ఆలమూరు: వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఒక పక్క ఎండలు మండుతుంటే మరో పక్క కూరగాయల ధరలు పెరిగి వినియోగదారుడి నెత్తిన తీవ్రమైన భారం పడింది. వేసవి తీవ్రతతో పాటు గతంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో ఆ ప్రభావం కూరగాయలపై పడి రోజురోజుకూ పెరుగుతున్నాయి. మృగశిర కార్తె వచ్చినా ఎండలు తగ్గకపోవడంతో ఉష్ణోగ్రతలు పెరిగి జిల్లా వ్యాప్తంగా నదీ పరీవాహక ప్రాంతంలోని తోటలన్నీ దశల వారీగా ఎండిపోయాయి. దీంతో కూరగాయల దిగుబడి తగ్గిపోయి నానాటికి కొరత తీవ్రమవుతుంది. దీంతో వారం రోజుల వ్యవధిలోనే దాదాపు కూరగాయ ధరలు రెట్టింపు కావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకూ మడికి అంతర్రాష్ట కూరగాయల మార్కెట్ నుంచి దేశం నలుమూలలకు ఎగుమతి అయ్యే కూరగాయలు నేడు తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గంలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని 12 మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో కూరగాయ పంటలు సాగువుతున్నాయి. ఈ వేసవిలో వాతావరణ పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉండటంతో రైతులకు కూరగాయల సాగు ఏమాత్రం ఆశాజనకంగా లేదు. రుతుపవనాల ప్రభావం వల్ల జూన్ నెలాఖరు నాటికి వర్షాలు వచ్చినా ఆగస్టులో వరదలు సంభవించే అవకాశం ఉండటంతో కూరగాయల సాగుకు సెప్టెంబర్ నెలాఖరు వరకూ లంక రైతులు ముందుకు వచ్చే అవకాశం లేదు. మెట్ట ప్రాంతంతో పాటు, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పంట అందుబాటులోకి వస్తే ధరల్లో కొంత మేర ఉపశమనం కలిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయం మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతుంది.

ధర ఉన్నా దిగుబడి లేదు

మార్కెట్ విపణిలో కూరగాయలకు అత్యధిక ధర పలుకుతున్నా తగినంత దిగుబడి లేకపోవడంతో రైతులకు శాపంగా పరిణమించింది. ఈ ఏడాది సుదీర్ఘకాలం పాటు ఎండలు కొనసాగడంతో కూరగాయ తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనివల్ల మడికిలో అంతర్రాష్ట కూరగాయల మార్కెట్‌కు గతంతో సుమారు 15 టన్నుల కూరగాయలు సరఫరా కాగా ప్రస్తుతం మూడు టన్నులకే పరిమితమైంది. ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడి తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎరువుల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో పాటు కూలీల కొరత ఏర్పడటం వల్ల కూరగాయల సాగు ప్రశ్నార్థకంగా మారిందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలు	రూ.పాత ధర (కేజీల్లో)	రూ.కొత్త ధర (కేజీల్లో)
ఉల్లి	20	30
మిరపకాయ	30	90
అల్లం	40	80
బంగాళాదుంప	18	30
వంకాయ	20	60
బెండకాయ	20	60
బీట్‌రూట్	20	60
కాలీఫ్లవర్	10	30
చిక్కుళ్లు	60	80
అరటికాయ	05	08
దొండకాయ	20	30
టమాటా	30	60
బీరకాయ	30	80
ఆనపకాయ	10	20
క్యాప్సికమ్	40	70


సరఫరా తగ్గింది



వేసవి ప్రభావం వల్ల కూరగాయ తోటలు ఎండిపోయాయి. ఎండల ప్రభావం సుదీర్ఘంగా ఉండటంతో కూరగాయల దిగుబడులు తగ్గి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి.

– చిన్నం రాజు, కూరగాయల వ్యాపారి, కొత్తూరు

ధరలు దారుణంగా పెరిగాయి



వారం రోజుల వ్యవధిలో కూరగాయ ధరలు రెట్టింపయ్యాయి. దీనివల్ల కూరగాయలు కొనుగోలు చేయడం భారంగా మారింది. బడ్జెట్ చూచుకుని కూరగాయలు కొనే పరిస్థితి నెలకొంది.

– నిచ్చెనకోళ్ల సుబ్రహ్మణ్యం, చింతలూరు

స్థానిక ఎన్నికలు నిర్వహించడంలో విఫలం

యానాం: యానాం, పుదుచ్చేరి, కారైకల్, మాహే మున్సిపాలిటీలకు, పంచాయతీలకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో ఎల్జీ విఫలమయ్యారని మాజీ ఎంపీ ఎం.రామదాస్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 55 ఏళ్ల కాలంలో 1968 నుంచి 2023 వరకూ కేవలం 2006లో ఒక్కసారే ఎన్నికలు నిర్వహించారన్నారు. పాలకవర్గం కాలపరిమితి ముగిసి 12 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ ఎన్నికలు నిర్వహించలేదన్నారు. రాజ్యాంగపరంగా ఆమె విధులను నిర్వహించడంలో విఫలమయ్యారని నిందించారు. దీనివల్ల మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు.

లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే అశోక్

యానాం: మహారాష్ట్ర రాజధాని ముంబైలో జరుగుతున్న నేషనల్ లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్(ఎన్ఎల్‌సీ)కు యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదివారం హాజరయ్యారు. దేశవ్యాప్తంగా సుమారు 2,500 మంది ఎమ్మెల్యేలు, ఆయా అసెంబ్లీల స్పీకర్‌లు, వివిధ రాజకీయపార్టీల నాయకులతో మూడు రోజుల పాటు జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో సామాజికాభివృద్ధికి ప్రధానంగా 10 అంశాలపై సాంకేతికత, ఆర్థికాభివృద్ధి దిశగా అధికారులు, శాసనసభ్యుల పాత్ర తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ దేశంలో సామాజిక అసమానతలు రూపుమాపడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

త్వరలో 146 ప్రైమరీ టీచర్ పోస్టుల భర్తీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా 146 ప్రాథమిక పాఠశాలల టీచర్ పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్నట్లు ఆదివారం సీఎం రంగసామి పేర్కొన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) ఆధారంగా ఈ నియామకాలు ఉంటాయన్నారు. 128 ప్రైమరీ టీచర్లను పుదుచ్చేరి నుంచి కారైకల్‌కు బదిలీ చేసి నాలుగేళ్లు అవుతుందని, తమను తిరిగి పుదుచ్చేరికి పంపాలని పలువురు సీఎం రంగసామిని కోరారు. దీంతో ఆయన ఉపాధ్యాయుల బదిలీ పాలసీలో మార్పులు వచ్చాయని, కారైకల్ నుంచి పుదుచ్చేరికి బదిలీ చేసేలా దశల వారీగా చర్యలుంటాయన్నారు. ఎవరైనా రిటైర్‌మెంట్ దశలో ఉంటే అటువంటివారిని బదిలీ చేయరన్నారు.

కాపునాడు నాయకుల పరామర్శ

అమలాపురం రూరల్: సతీ వియోగంతో బాధపడుతున్న చెన్న మల్లేశ్వర కళాపరిషత్ నాయకుడు నల్లా శ్రీధర్‌ను రాష్ట్ర కాపునాడు వర్కింగ్ అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ ఆదివారం పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. శ్రీధర్ భార్య ఇంద్రాణి మరణానికి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపినవారిలో కాపు సంఘం నాయకులు గంగుమళ్ల శ్రీనివాస్, కాకిలేటి దుర్గారావు, అబ్బిరెడ్డి దొరబాబు, నల్లా భాస్కరరావు తదితరులున్నారు.

ఐదుగురి అరెస్ట్

యానాం: యానాం నియోజకవర్గంలో వివిధ కేసుల్లో ఐదు మోటార్ సైకిళ్లను దొంగిలించిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శేరు నూకరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులను యానాం సబ్‌కోర్టులో హాజరుపరచగా వారికి మెజిస్ట్రేట్ ఏడు రోజుల పాటు రిమాండ్ విధించారన్నారు.

వెంకన్న నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన బి.శ్రీమన్నారయణ–ఝాన్సీ దంపతులు రూ.15,116, రావులపాలేనికి చెందిన కె.నాగమణి రూ.10,116, తణుకు మండలం సజ్జాపురానికి చెందిన ఐ.శ్రీనివాసరాజు–పార్వతీ దంపతులు రూ.10,116, కాకినాడకు చెందిన కేఎస్ సంపత్ కుమార్–మాధవి దంపతులు రూ.10,116, ర్యాలి గ్రామానికి చెందిన ఎం.సత్యం–కృష్ణకుమారి దంపతులు రూ.10,116, చోడవరానికి చెందిన కె.శ్రీనివాస్–దుర్గాసుజాత రూ.10 వేల విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు. బుల్లితెర నటుడు మధుసూదన్ కుటుంబ సభ్యులు స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

30 మంది రక్తదానం

కొత్తపేట: అవిడి పీహెచ్‌సీలో ఆదివారం 30 మంది రక్తదానం చేశారు. సుప్రీంకోర్టు న్యాయవాది కల్యాణ్ దిలీప్ సుంకర పుట్టినరోజు సందర్భంగా జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు అడపా ఆనంద్, వంగూరి అంజి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది.

ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్

మామిడికుదురు: బైక్‌లను దొంగిలించి వాటి నంబర్ ప్లేట్లతో పాటు రంగులు మార్చి విక్రయిస్తున్న ముగ్గురు దొంగల్ని అరెస్టు చేసి రాజోలు ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చామని నగరం ఎస్సై షేక్ జానీ బాషా ఆదివారం తెలిపారు. ఈ కేసులో పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన రాయి రాజు అలియాస్ డేవిడ్‌రాజు (బైక్ మెకానిక్), నాగుల్లంక శివారు గుడ్డాయిలంకకు చెందిన కొనుకు నాగేంద్రరాజు (పెయింటర్), అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడు (పెయింటర్)ని అరెస్టు చేశామన్నారు. వీరికి కోర్టు ఈ నెల 27వ తేదీ వరకు రిమాండ్ విధించిందని చెప్పారు. జల్సాలకు అలవాటు పడిన ఈ ముగ్గురు బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీరి వద్ద నుంచి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పాశర్లపూడి, ఈదరాడ గ్రామాలకు చెందిన రెండు బైక్‌లతో పాటు రాజోలుకు చెందిన మూడు బైక్‌లు, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన మరో బైక్ ఉన్నాయని ఎస్సై చెప్పారు. బైక్‌ల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించిన ఈ ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని విచారణ జరపగా దొంగతనం బయటపడిందన్నారు.